


*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఆధారం

"ఇంకా రాలేదు వాసంతి" చిరాగ్గా అనుకుంటూ, అసహనంగా కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది దీపిక. అవతల సినిమా టైమయిపోతోంది, ఇక్కడ ఈ పిల్ల ఇంకా రాలేదు.

" దీప్స్, వెళ్దామా?" భర్త రాజేష్ తొందర పెడుతున్నాడు.

"ఒన్ మినిట్ రాజ్" అంటూ ఫోన్ కలపడానికి ప్రయత్నించింది, కలవలేదు.

" పోనీ చిన్నవాడిని తీసుకుని వెళ్ళు, పెద్దవాడూ, నేనూ ఉంటాము, వాడేమీ గొడవ పెట్టడు కదా," అంది దీపిక తల్లి వాణి.

ఆవిడ తన కొడుకూ, కోడలూ, పిల్లలతో కలిసి అదే అపార్ట్ మెంట్లోనే వేరే బ్లాక్ లో ఉంటుంది. కొడుకు ఉద్యోగరీత్యా ఒక సంవత్సరం కోసం అమెరికా వెళ్ళినందువల్ల ఇక్కడే ఉంటోంది. మిగతా పిల్లలిద్దరూ వారి ఊరిలోనే ఉంటారు.

" నీకు తెలీదమ్మా, వీడు ఎంత సతాయిస్తాడో? ఒక్క నిమిషం కూడా సినిమా చూసినట్టే ఉండదు. వీడితో వేగడం నా వల్ల కాదు, వాసంతే కరక్ట్. దెయ్యం, ఈ నెల్లో ఇది మూడోసారి ఇలా లేట్ చెయ్యడం, దీనికి బాగా ఎక్కువయింది, దీని సంగతి నాకు అర్థం కావడం లేదు ",అని చిరాకుపడుతూ ఉండగా నెమ్మదిగా, భయంగా వచ్చింది వాసంతి.

"ఇంత లేటా?" దాదాపు అరిచింది ఆ పిల్ల మీద.

" దీదీ, అది, తమ్ముడు స్కూల్ నించి వస్తూ పడిపోయాడు, అమ్మా నేనూ కలిసి డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళి వచ్చేసరికి కొద్దిగా ఆలస్యం అయింది, మీరు వెళ్ళండి, నేను చూసుకుంటాను" అంటూ దీపిక తీక్షణమైన చూపుల్లోకి తన కళ్ళు కలపకుండా పిల్లల గదిలోకి పరిగెత్తింది వాసంతి.

అప్పటికే సినిమా టైము దగ్గరపడ్డం వల్ల, మరేమీ అనకుండానే చెప్పులు వేసుకుని బయలుదేరింది.

దీపిక వాళ్ళ అమ్మకిదంతా కొత్తగా ఉంటుంది, ఆవిడకి నలుగురు పిల్లలున్నా ఎప్పుడూ ఇంటి పనికి కానీ, పిల్లల పనికి గానీ ఎవరి మీదా ఆధారపడలేదు. అన్ని తనే చూసుకునేది.

'తన కూతురు చూస్తే ఇలా? పొద్దున్న లేచి ఏం పని చేస్తుందో తెలీదు. ఇంటి పనికి ఒకరు, వంటకి మరొకరు కాక, పిల్లలని చూసుకోవడానికి పనిమనిషి కూతురు వాసంతి. కష్టం మీద అత్తగారు వాళ్ళు వచ్చినప్పుడు ఓ రెండు రోజులు వంటగదిలోకి వెళుతుందేమో, మిగతా వేళల్లో ఎప్పుడూ పని చేసిన పాపాన పోదు.'

ఏమైనా అంటే..

" నా భర్త సంపాదిస్తున్నది దేనికోసం? నేనూ, పిల్లలూ సుఖంగా ఉండాలనే కదా? అయినా నువ్వు మా చిన్నప్పుడు కష్టపడ్డావని ఇప్పుడు మమ్మల్ని కూడా అలాగే ఉండమంటావా? నీ కోడలు మాత్రం పెట్టుకోలేదూ పనివాళ్ళని? వాళ్ళకేమీ చెప్పవు, నాదగ్గరే నీ నీతిబోధలన్నీ, ఇప్పుడంతా అందరూ ఇంతే, నీకేమీ తెలీదు లేమ్మా " అని వెక్కిరిస్తుంది.

పనికి సహాయంగా మనుషులని పెట్టుకోవడం వేరు, ఇది వేరు అని చెప్పాలనుకున్నా చెప్పలేదు. నాలుగు రోజులుండిపోయేదాన్ని నాకెదుకు? అని ఊరుకుంటుందావిడ.

అదీ కాక దీపిక తల్లిగా ఆమె స్వభావం చిన్నప్పటినించీ బాగా తెలుసు. ముక్కు మీద కోపం ఆ పిల్లకి, అంతే కాదు, దానికి అనుబంధంగా పనిచేసే నోరూ ఎక్కువే. కోపం వస్తే ఆమె నోరు కంట్రోల్ లో ఉండదు. ఎంత మాట వస్తే అంత మాట అనేస్తుంది. అందరికంటే చిన్నదని అందరూ గారాబం చెయ్యడం వల్ల ఆమె మంకుతనం మరింత పెరిగింది. మనసు మంచిదే మళ్ళీ. ఏదైనా తప్పు చేసినా, రెండు రోజుల తర్వాత మాత్రమే దాని గురించి ఆలోచిస్తుంది, అప్పుడెవరైనా చెప్తే వింటుంది.

వాసంతి కి పదిహేడేళ్ళుంటాయేమో , చాలా మంచి పిల్ల, నెమ్మదిగా, అణకువగా ఉంటుంది. వాసంతి తల్లి, లక్ష్మి అదే అపార్ట్ మెంటులో మూడు నాలుగిళ్ళలో పని చేస్తుంది, వాసంతి కాక శోభా, రాజు అని మరో ఇద్దరు పిల్లలు లక్ష్మికి. లక్ష్మి భర్త రాజయ్య చాలా ఏళ్ళు ఏదో ఫాక్టరీ లో పనిచేసేవాడు, అతను పని చేసినంతవరకూ ఆ కుటుంబ పరిస్థితి బాగానే ఉండేది, కానీ అకస్మాత్తుగా రాజయ్యకి రెండు కిడ్నీలు దెబ్బ తినడం వల్ల అతను పని మానేసే పరిస్థితి రావడమే కాక, వారానికి రెండు సార్లు క్రమం తప్పకుండా హాస్పటల్కి వెళ్ళి దయాలసిస్ చేయించుకోవడం కొత్త పనిగా మిగిలింది. డాక్టర్ గారు వీలున్నంత తక్కువ ఖరీదులో అది జరిగేలా సహకరిస్తున్నా కూడా కుటుంబానికి అది అదనపు భారమే అయింది.

అప్పుడే తల్లికి తోడుగా శోభ కూడా రెండిళ్ళలో పనికి చేరింది, ఇరవై ఏళ్ళ శోభకి పెళ్ళి చేసి పంపిద్దామనుకున్న లక్ష్మికి అదసలు ఇష్టం లేదు, కానీ తప్పలేదు. తల్లీ కూతుళ్ళిద్దరూ కలిసి ఐదారిళ్ళలో రకరకాల పనులు చేసుకుంటూ రాజయ్య వైద్యమూ, పిల్లవాడి చదువూ, కుటుంబపు ఖర్చులూ గడుపుకొస్తున్నారు. ఎంత వారికైనా ఈ మహానగరపు జీవితాలు సులభం కాదు.

అమ్మా, అక్కా పనికి వెళ్తే వాసంతి ఇంటి పనీ, వంట పనీ చూసుకునేది. అలాంటి సమయంలో శోభకి సేలం దగ్గర తిరుపూరు నించి మంచి సంబంధం వచ్చింది, అబ్బాయి అక్కడే ఒక మంచి బనీన్ల ఫాక్టరీలో సూపర్వైజర్ గా పని చేస్తున్నాడు. ఇరు వైపులవారికీ అన్నీ నచ్చడంతో శోభ పెళ్ళి పెద్ద ఇబ్బందులేమీ లేకుండా జరిగిపోయింది. తను పని చేసే ఇళ్ళలో అప్పు తీసుకుని దానితోనూ, కొద్దిగా దాచుకున్న డబ్బుంటే, దానితోనూ మొత్తానికి కార్యక్రమాన్ని జరిపించింది లక్ష్మి. అప్పుడు దీపిక కూడా బాగా సాయం చేసింది. నెల నెలా కొద్ది కొద్దిగా జీతంలోంచి కట్ చేసుకునే ఒప్పందం మీద.

దీపిక పెద్ద కొడుకు వన్ష్ ని తీసుకుని వచ్చినప్పుడు మొదటిసారి చూసిందావిడ వాసంతిని. సన్నగా, తెల్లగా నెమ్మదిగా ఉన్న ఆ పిల్ల అంటే అప్పుడే చాలా ఇష్టం ఏర్పడింది ఆవిడకి. ఆ తర్వాత కొడుకూ వాళ్ళూ కూడా ఇక్కడికే వచ్చేయడమూ, దీపికకి రెండో కొడుకు పుట్టడమూ అన్నీ జరిగిపోయాయి. తనే చిన్న పిల్ల అయినా సరే, పిల్లలతో వాసంతి మెలిగే తీరు ఎంతో ముచ్చటగా ఉంటుంది మూడేళ్ళుగా చూస్తున్న ఆవిడకి. మూడేళ్ళ వన్ష్ నీ, ఏడాదిన్నరవాడైన యష్ నీ కూడా ఎంతో ప్రాణంగా చూసుకుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే తనే కన్నతల్లిలా.

పొద్దున్నే చిన్నవాడి పాలసీసాలు వేడి నీళ్ళలో ఉడికించడంతో ఆ పిల్ల పని మొదలు. పెద్దవాడు లేవగానే వాడిని తయారు చెయ్యడమూ, టిఫిన్ పెట్టి దగ్గరలోనే ఉన్న ప్లే స్కూల్ లో విడిచి రావడమూ అయేసరికి చిన్నవాడు లేచి ఉంటాడు. అప్పటినించీ వాడి పని. వాడి స్నానమూ, తిండీ, ఆడించడమూ ఇలా. మధ్యాహ్నం వెళ్ళి పెద్దవాడిని తీసుకుని రావాలి. ఈ పనులన్నీ సవ్యంగా జరుగుతున్నాయా, లేదా?

అని వెయ్యి కళ్ళతో పర్యవేక్షిస్తూ ఉంటుంది దీపిక. తను మాత్రం ఒక్క వేలు వెయ్యదు. వాళ్ళు మధ్యాహ్నం పడుకున్నాకా వాళ్ళు ఆడి ఇల్లంతా పడేసిన బొమ్మలూ, పుస్తకాలూ సర్ది అప్పుడు అన్నం తింటుంది వాసంతి.

వాళ్ళమ్మ తోమి బోర్లించిన గిన్నెలు మెత్తటి బట్టతో శుభ్రంగా తుడిచి ఎక్క డివక్కడ సర్దడమూ, మెషీన్లో రోజూ బట్టలు వేసి, ఆరవేసి మడతలు పెట్టడమూ, పిల్లల బట్టలు ఇస్త్రీ చెయ్యడమూ, సీసాల్లో మంచి నీళ్ళు నింపడమూ, ఇల్లంతా దుమ్మూ, ధూళీ లేకుండా దులపడమూ ఇలా ఏదో ఒక పని ఉంటుంది వాసంతికి. దీపిక జుట్టుకి హెన్నా పెట్టడమో, పిండి మర పట్టించుకుని రావడమో ఇలా ఏదో ఒక కొత్త పనిఅదనం.

పిల్లలతో ఎక్కడికి వెళ్ళాలన్నా వాసంతి తోడు ఉండవలసిందే. అది పార్టీ అయినా, పార్క్ కైనా.

" వాళ్ళ వెనకాల నేను పరిగెత్తలేను బాబూ! " అంటుంది దీపిక వయ్యారంగా.

పొద్దున పిల్లలు నిద్ర లేచే సమయానికి వచ్చే వాసంతి మళ్ళీ రాత్రి వాళ్ళిద్దరూ పడుకున్నాకే ఇంటికి వెళ్ళేది, అంతగా అలవాటయిపోయిందా పిల్ల దీపికకి, ఆమె పిల్లలకీ. రాత్రి తనో, భర్త రాజేషో దింపి వస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాత్రి వాసంతి వేరే ఎవరింట్లోనైనా ఉండడాన్ని ఒప్పుకోదు లక్ష్మి .

" వద్దమ్మా, ఆళ్ళ అయ్య ఊరుకోడు, దానికి కాబోయే వాడు, మా తమ్ముడూ ఊరుకోడు" అంటుంది. అందుకనే పిల్లలని వాసంతి దగ్గర వదిలి సెకండ్ షోలకి, పార్టీలకీ వెళ్ళినా సరే రాత్రి దింపేసి వస్తారు వాసంతిని.

పిల్లల సెలవుల్లో గోవా తీసుకువెళతానంది దీపిక వాసంతిని. తనకి పిల్లలని చూసుకోవడానికి తోడుగా, దానికీ లక్ష్మి ఒప్పుకోలేదు మొదట. వాసంతే విమానం మీద మోజుతో తండ్రినీ, మావయ్యనీ బ్రతిమాలీ, అలిగీ, ఏడ్చీ, అన్నం మానీ, ఒప్పించి మరీ వెళ్ళింది.

" అదేమిటే? నీ పిల్లాడిని కనీసం ఆ నాలుగు రోజులైనా ఎత్తుకోలేవూ? వాళ్ళు పంపం మొర్రో అంటూ ఉంటే ఎందుకీ బలవంతం?" అన్న తల్లిని

" ఊరుకో అమ్మా, వీడినెత్తుకుని తిరుగుతూ ఉంటే నా హాలిడే అయినట్టే, వాసంతి ఉంటే ఇద్దరినీ చూసుకుంటుంది, నాకు హాయిగా ఉంటుంది. పంపకపోవడానికేం రోగం? హాయిగా విమానం లో తీసుకెళ్తాను, స్టార్ రిసార్ట్ లో ఉంచుతాను మాతో పాటు, పంపడానికి నఖరాలు " అంది కోపంగా.

" అలా అనకు దీపూ, ఎదిగిన ఆడపిల్లని పరాయి వాళ్ళతో పంపకపోవడానికి వంద కారణాలుంటాయి, తొందరపడి అలా అనకూడదు" అని ఇంకా ఏదో చెప్పబోతున్న తల్లిని మింగేలా చూస్తూ.

" ఇవన్నీ, ఇలాగే వాళ్ళతో చెప్పు, ఇంకా బాగా పంపిస్తారు " అంది కోపంగా.

అలా గోవాలో నాలుగు రోజులూ పిల్లలగురించి చీకూ చింతా లేకుండా దీపికా, ఆ ఖరీదైన గొప్ప వాతావరణాన్ని చూస్తూ ఆనందంగా వాసంతీ ఇద్దరూ హాయిగా గడిపారు. ముఖ్యంగా మరో లోకంలోకి వచ్చినట్టుగా అనిపించిన వాసంతి.

గోవా నించి వచ్చిన నెలరోజులకి వాసంతి పెళ్ళి మేనమామ రమేష్ తో జరిగింది. అతను డ్రైవర్ గా పనిచేస్తాడు, రాత్రి తను ఇంటికి వచ్చేసరికి వాసంతి ఇంటి దగ్గర ఉండాలని అతని కోరిక. ఆలస్యం అయితే చిరాకు, దానివల్ల అప్పుడప్పుడు వాసంతి దీపిక కి చెప్పి తొందరగా వెళ్ళడానికి ప్రయత్నిస్తోంది. అదీ దీపికకి నచ్చడం లేదు, కానీ గట్టిగా ఏమీ అనలేక అప్పుడప్పుడు ఊరుకున్నా, అప్పుడప్పుడు సాధిస్తూనే ఉంటుంది.

దీపిక ఏమన్నా వాసంతి తొందరగా ఎదురు చెప్పదు, విననట్టు తన పని తను చేసుకు పోతుంది. ఆమె చెప్పిన పని చెప్పినట్టుగా చెయ్యడానికి మాత్రం ఎప్పుడూ తాపత్రయపడుతుంది. అలా తనకే అర్థం కాని తన కూతురి దగ్గర ఎంతో చక్కగా ఇన్నేళ్ళనించీ మెలిగే ఆ పిల్లని చూస్తే దీపిక వాళ్ళ అమ్మ వాణికి ఇష్టం.

" కోపం వస్తే తప్ప మిగతా అప్పుడల్లా దీదీ మంచిదే కదా, కోపం రాకుండా మనం చూసుకుంటే పోలేదా పెద్దమ్మా? " అంటుంది నవ్వుతూ. అలాగే నడుచుకుంటుంది.

అలాంటిది ఒకరోజు పొద్దున్నే దీపిక కేకలు వినబడడంతో చేసుకుంటున్న పూజ త్వరగా ముగించి బయటకు వచ్చింది వాణి.

"నీకసలు బుద్ధుందా? వాడిని స్కూల్ వేన్ వచ్చేసరికి తయారు చెయ్యకుండా ఊరికే టైం వేస్ట్ చేశావు. ఇప్పుడు వాడిని స్కూల్ దాకా కార్ లో దింపాలి, నాకవతల కిట్టీ పార్టీ కి టైమవుతోంది, ఇన్ని ట్రిప్పులు వెయ్యాలంటే పె ట్రోల్ నీ బాబిస్తాడా? మొన్నా అలాగే చేశావు, ఆ రోజు వేన్ ఆఖరినిమిషం లో అందింది. నీకీ మధ్య బాగా ఎక్కువయింది, నిన్నూ, మీ అమ్మనీ, మీ కుటుంబాన్నీ పోషిస్తున్నాను కదూ, నా మీదే మీరు ఆధారపడ్డారు అయినా సరే పొగరు మీ అందరికీ" ఇలా సాగుతోంది ఆవిడ ధోరణి.

" కాదు దీదీ, యష్ బాబుని అంతా తయారు చేసేసి కిందకి తీసుకెళ్దామనుకునే టైముకి బాత్రూం కి వెళ్ళాలి, కడుపు నొప్పి అని గొడవ చేశాడు. నిన్న రాత్రి పార్టీ నించి వచ్చినప్పటినించీ "పొట్టలో ఎలాగో ఉంది" అని అంటూనే ఉన్నాడు. బాత్రూం పని ముగించుకుని వచ్చేసరికి వేన్ వెళ్ళిపోయింది. " అంది వాసంతి.

" నోరు తెరిస్తే సాకులు చెప్పడం మాత్రం తెలుసు, అది కూడా పిల్లాడి మీద పెడుతున్నావు." అని ఇంకా ఏదో అనబోతూ ఉంటే వాణి కల్పించుకుని

" పోనీలే దీపూ, వాడి వల్లే ఆలస్యం అయింది అంటోంది కదా, ఊరుకో, ముందు వాడి కడుపు నొప్పి సంగతి కనుక్కో, పరవాలేదంటే నువ్వో, రాజేషో వెళ్ళి దింపేసి రండి, దీనికింత రాద్ధాంతం దేనికి ? అందావిడ అనునయంగా.

" నువ్వూరుకో అమ్మా, నిన్న రాత్రి బ్రష్ చేసుకుని నా దగ్గరకు వచ్చి గుడ్ నైట్ చెప్పినప్పుడు చక్కగా ఉన్నాడు, ఇది కూడా అక్కడే ఉంది అప్పుడు, ఇప్పుడు మాత్రం సాకులు చెప్తోంది" అంది కోపంగా.

"సారీ దీదీ, బాబు కడుపు నొప్పి అనేసరికి ఆ హడావిడిలో టైము చూడలేదు " అంది వాసంతి నెమ్మదిగా.

కానీ ఎందుకో ఆ రోజు దీపిక కోపం తొందరగా తగ్గలేదు, లక్ష్మి వచ్చాకా కూడా విరుచుకు పడిందామె మీద. జ్వరంగా ఉండడం వల్ల అంతకు ముందు రెండు రోజులు పనిలోకి రాలేదు లక్ష్మి , అయినా వాసంతి అన్ని పనులూ చేసింది.

ఆ సంగతి కూడా కలిపి " మీరు వచ్చినా రాకపోయినా నేను ఏదీ పట్టించుకోను, ఎప్పుడూ డబ్బులు తగ్గించను, అందుకే మీరు ఇలా అలుసుగా చూస్తున్నారు" అంటూ మొదలు పెట్టింది.

ఇలా ఎన్నోసార్లు చిన్నవాటికీ, పెద్దవాటికీ జరిగినా అవసరం తమది, ఊరికే నోరు పారేసుకున్నా సమయానికి సహాయం చేసింది కదా, అని యజమానురాలి మీద ఉన్న గౌరవం వల్ల ఎప్పుడూ మాట్లాడకుండా పని చేసుకుని వెళ్ళిపోయేవారు తల్లీ కూతుళ్ళిద్దరూ. కానీ ఈ రోజెందుకో ఊరుకోలేకపోయింది లక్షి .

"పిల్లాడు కడుపునొప్పన్నాడు అని చెప్పింది కదమ్మా, దానికేం చెయ్యమంటావు చెప్పు? మీరు పార్టీ కెళ్ళాలంటే పోనీ అదే ఆటోలో తీసుకెళ్ళి దింపేసి వస్తుందిలే" అంది.

" అవును, దింపుతుంది. నేను డబ్బులిస్తే ఆటోలో ఏం ఖర్మ ? టేక్సీలో కూడా దింపుతుంది" అంది దీపిక వెక్కిరిస్తున్నట్టుగా.

" ఏందమ్మా, ఓ డబ్బులంటావు? పోనీలే, ఈ రోజుకి నేనే ఇస్తాలే ఆటో డబ్బులు" అంది విసురుగా ఏనాడూ మాట తూలని లక్షి . జ్వరం పడి లేచిందేమో, విపరీతమైన నీరసంగా ఉంది ఆమెకి, అందుకే గభాల్న అనేసింది.

ఆ మాటతో దీపిక కోపం తారాస్థాయికి చేరింది. " ఎంత ధైర్యం? నాకు నువ్వు ఆటో డబ్బులిస్తావా? ఏం చూసుకుని మాట్లాడుతున్నావు అలా? నిన్నూ, నీ పిల్లనీ రోజూ మూడుపూట్లా మేపుతున్నాను కదూ, అంటావు." ఇలా మొదలయింది దీపిక వాదన.

లక్షి కి ఈ వాదులాట పొడిగించడంలో అర్ధం లేదని అర్ధం అయ్యి, మౌనంగా తన పని చేసుకుపోసాగింది. దాన్ని తన పట్ల ఆమె చూపించే నిర్ల క్ష్యంగా భావించిన దీపిక మరింత రెచ్చిపోయింది.

తల్లి ఎంతో చెప్పడానికి ప్రయత్నించినా వినకుండా లక్షి నీ, వాసంతినీ నానా మాటలూ అంది. పని ముగించుకుని మధ్యాహ్నం లక్ష్మీ, సాయంత్రం వాసంతీ వెళ్ళిపోయారు. ఆ రోజంతా దీపిక ధుమ ధుమ లాడుతూనే ఉంది.

" ఎంత బాగా చూసుకున్నా సరే వీళ్ళకేమాత్రం విశ్వాసం ఉండదు, నేను వెళ్ళిన చోటకల్లా తీసుకెళ్ళాను చివరికి విమానం ఎక్కించి గోవా హాలిడేకి. ఒక్క మాట మాత్రం అనకూడదు." ఇలా చిరాకు పడసాగింది.

మర్నాడు వాళ్ళ అమ్మ అనుకున్నట్టే తల్లీ కూతుళ్ళిద్దరూ పనిలోకి రాలేదు. ఆ రోజు శనివారం కనక పిల్లలకి స్కూల్ లేదు.

"వీళ్ళిద్దరూ ఇంకా రాలేదేం?" అప్పటికి నాలుగో సారి అనుకుంది దీపిక.

దాదాపు పదింటికి వచ్చింది లక్షి తన దగ్గరున్న దీపిక ఇంటి తాళం తీసుకుని.

అప్పుడు చెప్పింది సంగతి. వాసంతి భర్త పని మానేయమన్నాడనీ, తాను కూడా ఈ నెలాఖరువరకూ పని చేసి అప్పుడు మానేస్తానని.

" ఒకేసారి ఇద్దరూ మానేస్తే మీరిబ్బంది పడతారని ముందే చెప్తున్నానమ్మా, నెలాఖరులోపల మరెవరినైనా చూసుకోండి" అని గబ గబా తన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోయింది.

అలా జరుగుతుందని అసలు ఊహించలేదు దీపిక.

"చూశావా అమ్మా, రోజూ వాళ్ళనే వెనకేసుకుని వచ్చేదానివి కదా, ఇప్పుడు చూడు ఏం జరిగిందో?" అంది ఆవేశంగా. ఆవిడేమీ మాట్లాడలేదు.

పిల్లలు నిద్ర లేచినప్పటినించి మొదలయ్యాయి దీపిక కష్టాలు. వాళ్ళని సంభాళించడం మాట అటు ఉంచితే వాళ్ళకి సంబంధించిన ఏ విషయమూ ఆవిడకి తెలీదు.

పెద్దవాడు లేస్తూనే గ్లాసుడు పాలు తాగితేనే కానీ మాట్లాడదు, చిన్నవాడికి నిద్ర లేస్తూనే వాడి ఫేవరిట్ టెడ్డీ బేర్ బొమ్మ చేతిలో ఉండకపోతే ఆరున్నొక్క రాగం పెట్టేస్తాడు.

"హాయ్ బేబీస్, లేవండి, బ్రష్ చేసుకుందాం" అని పిలిచింది వాళ్ళ గది దగ్గరకి వెళ్ళి.

పెద్దవాడు ఏమీ మాట్లాడలేదు, పక్కకి తిరిగి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. చిన్నవాడు కళ్ళు విప్పి చూసి తన బొమ్మ కనిపించకపోయేసరికి బేర్ మని ఏడుపు మొదలు పెట్టాడు.

అసలు విషయం తెలియని దీపిక కంగారు పడింది.

పది నిమిషాల తరవాత ఆ రెండూ విషయాలు అర్థమయి పెద్దవాడికి పాలూ, నిద్రలో తన్నేస్తే మంచం కింద పడిన బొమ్మని వెతికి చిన్నవాడికి ఇచ్చేసరికి, ఆ బొమ్మ చూసి పట్టరాని ఆనందంతో మళ్ళీ పడుకున్నాడు, కానీ పెద్దవాడికి మాత్రం పాలు వేడి తక్కువయిందిట, తాగనని ఒకటే మారాం చెయ్యడం మొదలు పెట్టాడు. అంతే కాదు, పాలన్నీ విసిరి పారేశాడు. ఇవన్నీ ఎప్పుడూ చూడని దీపికకి ఒళ్ళు మండిపోయింది.

"తాగితే తాగు, లేకపోతే ఫో" అని అరిచింది.

వాడు వెంటనే " నువ్వెందుకు ఇచ్చావు పాలు? వాసంతక్క ఏది? " అని విసుక్కున్నాడు ఏడుపులోనే.

" దాంతో దీపికకి మరింత కోపం వచ్చింది. చేతిలో గ్లాస్ నేలకి విసిరి కొట్టి, విసురుగా గదిలోంచి బయటకి నడిచింది.

ఇద్దరూ కలిసి పారపోసిన పాలన్నీ నేలంతా పరుచుకుని ఎండి మరకలు కట్టాయి.

వాళ్ళ పనులన్నీ ఎంతో శ్రద్ధతో చేస్తుంది వాసంతి. దీపికకి సగం విషయాలు తెలియవు, సగం పట్టించుకోలేదు, దానితో అయోమయం, గందరగోళం లా అయిందామె పరిస్థితి.

శని, ఆది వారాలు గడిచేసరికి ఒక సంవత్సరం గడిచినట్టయిందామెకి.

" సెలవురోజే ఇలా ఉంటే ఇంక స్కూల్ కి వెళ్ళాలంటే?" అనుకుంటేనే భయం వేసింది ఆమెకి.

వాళ్ళ బట్టల అలమారు ఏనాడూ సర్దలేదు, పుస్తకాలు ఎక్కడ పెడుతుందో తెలీదు, చిన్నవాడి డైపర్ లు వెతికేసరికి పావుగంట పట్టిందామెకి. ఇంట్లో అన్ని అలమరలూ వాసంతే సర్దుతుంది, దుమ్ము దులిపి షో కేస్ లూ అవీ అమరుస్తుంది. బట్టలూ, చెప్పులూ, తాళాలూ, బొమ్మలూ, పుస్తకాలూ, ఇతర సామాన్లూ ఏవి, ఎక్కడున్నాయో ఆ పిల్లకి తెలిసినట్టు దీపికకి తెలియదు. తెలుసుకునే ప్రయత్నం ఆమె ఎప్పుడూ చెయ్యలేదు.

అదీ కాక ఈ మధ్యన తన స్నేహితురాలితో కలిసి ఒక బొటీక్ పెట్టే ఆలోచనలో ఉండడం వల్ల, దీపిక సమయమంతా దానికి సంబంధించిన పనులతోనే సరిపోతోంది. అన్నీ సరిగ్గా జరిగితే మరొక రెండు నెలల్లో దాన్ని ప్రారంభించాలని ఆమె ఆలోచన.

" ఇలాంటి పరిస్థితుల్లో లక్ష్మీ, వాసంతి లేకుండానా?" చిన్నవాడు కూడా వచ్చే ఏడాది నించీ సాయంత్రం వరకూ స్కూల్ కి వెళతాడు కనక వాసంతిని కూడా బొటీక్ కి తీసుకుని వెళదామని అనుకుంది, ఇంతలో వీళ్ళిలా చేస్తున్నారు? "

అప్పుడర్థమైంది ఆమెకి తనకి వాళ్ళ అవసరం ఎంత ఉందో? ఎవరూ చూడకుండా బాల్కనీలోంచి వాసంతికి ఫోన్ చేసింది.

" దీదీ, బావున్నారా? బాబులు ఎలా ఉన్నారు? అని ఎప్పటిలాగే నవ్వుతూ పలకరించింది వాసంతి.

" బావున్నాము లే, నువ్వేంటి ఇలా చెప్పా పెట్టకుండా మానేశావు? " అంది , మనసులో ఇష్టం లేకపోయినా అవసరం అలాంటిది.

"మా ఆయన వద్దంటున్నాడు దీదీ, సాయంత్రం వచ్చేసరికి ఆలస్యం అవుతోంది కదా, బాబులు నిద్రపోయేవరకూ ఉండి వచ్చి, వంట చేసుకుని తినేసరికి ఆలస్యం అవుతోంది. ఆయన మళ్ళీ పొద్దున్నే డ్యూటీకి పోతాడు కదా, బాబులు ఎలా ఉన్నారు? సరిగా తింటున్నారా? పాలు తాగుతున్నారా? ఆడుకోవడానికి వాళ్ళని కిందకి తీసుకెళుతున్నారు కదా?" అంటూ ఎన్నో ప్రశ్నలు వేసింది.

ఏదో చెబ్దామనుకున్న దీపికకి మళ్ళీ అహం అడ్డు వచ్చింది. మళ్ళీ వచ్చేయమని చెప్పాలని ఉన్నా మనసు ఒప్పుకోలేదు, " సరే నీ ఇష్టం" అని ఫోన్ పెట్టేసింది.

వాళ్ళ అమ్మ ఆ మాట విని "ఆ పిల్లన్నదీ నిజమే కదా, పొద్దున్నే ఆరున్నరకొస్తుంది, రాత్రి పదవుతుంది ఇంటికి వెళ్ళేసరికి, నువ్వూ అల్లుడూ సినిమాకి వెళ్తే అర్ధరాత్రి దాటాకా దింపి వస్తారు, ముందంటే పరవాలేదు కానీ ఇప్పుడు దాని భర్త ఒప్పుకోవద్దూ," అంది ఆవిడ ఆలోచిస్తున్నట్టుగా.

దీపిక ఏమీ మాట్లాడలేదు. ఆమె మనసులో రెండు రకాల భావాలు చెదురుమదురుగా తిరుగుతున్నాయి. ఆ భావాలు స్పష్టమై, తన అసహాయత బయటపడడానికి ఆమెకి మరొక రెండు రోజులు పట్టింది.

ఆ రోజు లక్ష్మి జీతం తీసుకుని ఇదే చివరి రోజు అని చెప్పడానికి వచ్చింది.

" లక్ష్మీ, నిన్ను నేను కార్ లో దింపుతాను" అంటున్న యజమానురాలిని చిత్రంగా చూసింది లక్ష్మి .

లక్ష్మి ని ఇంటి దగ్గర దింపి కార్ వెనక్కి తీసి వెళ్ళిపోతుంది అనుకున్న లక్ష్మి అంచనాలకి భిన్నంగా ఆమెతో పాటు లోపలకి వచ్చింది.

అక్కడే గాద్రేజ్ కుర్చీ మీద కూర్చుని టీ వీలో రజనీ కాంత్ సినిమా చూస్తున్న వాసంతి దీపికని చూసి గభాల్న లేచి నిలబడింది. " దీదీ" అంటూ.

" వాసంతీ, నువ్వు రేపటినించీ పనిలోకి వస్తున్నావు, టైములూ మిగతా వివరాలూ మీ ఆయన వచ్చాకా ఒకసారి తీసుకుని ఇంటికి రా, వివరంగా మాట్లాడుకుందాం, నీకు ఎలా వీలుంటే అలా చేద్దాం, రానని మాత్రం అనకు, నువ్వు కూడా లక్ష్మీ.. ప్లీజ్, ఇంకేం మాట్లాడవద్దు " అంది వాసంతి చేతిని స్పృశిస్తూ.

వాళ్ళు లేకపోతే తనకి ఇంటిని నడుపుకోలేకపోతోందని వాళ్ళకి అంత కన్నా నేరుగా చెప్పడానికి అడ్డు వస్తున్న ఆమె అంతస్థు మాటలనైతే ఆపగలిగింది కానీ, ఆమె అశక్తతని పట్టిస్తున్న కన్నీళ్ళని ఆపలేకపోయింది. అవి మరింత బయటపడటం ఇష్టం లేనట్టుగా..

" నేను ఈ రోజంతా ఇంట్లోనే ఉంటాను, అతను ఎప్పుడొస్తే అప్పుడు వెంటబెట్టుకుని తీసుకురా, అన్నీ మాట్లాడదాం " అని వడి వడిగా బయటకు నడిచి కార్ ఎక్కి, ఏదో పెద్ద బరువు దిగినట్టుగా నిట్టూర్చింది. టిష్యూపేపర్ డబ్బా లోంచి ఒక టిష్యూ తీసుకుని కళ్ళు ఒత్తుకుని రివర్స్ చేసింది కార్ ని.

అదే రివర్స్ గేర్లోనే వెనక్కి వెళ్ళి రాత్రి అమ్మ చెప్పిన మాటలు గుర్తు చేసుకుంది.

వాసంతి తో ఫోన్ మాట్లాడి పెట్టేశాకా ఆవిడ అంది.

" దీపూ నువ్వేమీ అనుకోనంటే ఒక మాట చెప్తాను, ఇందులో తప్పొప్పులూ, అంతరాల ప్రసక్తి లేదు, ఈ కాలంలో లక్ష్మీ, వాసంతీ లాంటివాళ్ళు దొరకడం దాదాపు అసాధ్యం. ఇంటి తాళం ఇచ్చేసినా సరే, పిన్నీసైనా పోవడం మాట అటుంచి, పెట్టిన చోటనించి పక్కకు జరగకుండా శుభ్రంగా పని చేస్తుంది లక్ష్మి . ఇక వాసంతి సంగతైతే చెప్పక్కరలేదు, నీకు కోపం వచ్చినా సరే, కేవలం కన్నది మాత్రం నువ్వు, పిల్లలని ఓ అక్కలా, తల్లిలా ఎంత శ్రద్ధగా చూసుకుంటుందో నీకూ తెలుసు, ఆ పిల్ల రెండు రోజులు లేకపోతే తల్లక్రిందులైపోయిన నీ ఇంటికీ తెలుసు. ఇప్పటికే నీకర్థం అయి ఉండాలి, నీ ఇంటికి వాళ్ళిద్దరూ ఎంత ముఖ్యమో. "

"కానీ వాళ్ళు చేసినది బావుందా? నేనెంత చేశాను వాళ్ళకి? శోభ పెళ్ళికీ, మూడునెలల క్రితం జరిగిన వాసంతి పెళ్ళికీ, కాస్తయినా విశ్వాసం ఉందా? నా మీద ప్రతీ దానికీ ఆధారపడుతూ నన్నే తప్పు పడతారా? పైగా పని మానేస్తామని బెదిరింపా? నిన్న లక్ష్మి ఏమందో తెలుసా? ఒక్క నెల గడువియ్యమ్మా, ఎక్కడనించయినా వడ్డీకి తెచ్చి నీ కివ్వాల్సిన డబ్బు ఇచ్చేస్తాను అంది. ఏదో కోపంలో ఒక మాట అన్ననే అనుకో, ఇదా వాళ్ళు ప్రవర్తించే పద్ధతి?" అంది దీపిక రోషంగా.

దానికి వాణి నవ్వింది. " అదే తప్పు. నువ్వెప్పుడు కోపం వచ్చినా వాళ్ళని దెప్పుతూ ఉంటావు చూశావా? ఇద్దరినీ పనిలో పెట్టుకుని వాళ్ళ కుటుంబానికి ఎంతో సహాయం చేస్తున్నాను అనీ, వాళ్ళు నీ మీదే ఆధారపడి బ్రతుకుతున్నారనీ, దానికి వాళ్ళకేమాత్రం కృతజ్ఞత లేదనీ. అది నిజం కాదమ్మా, నిజానికి మనం ఆధారపడేది వాళ్ళమీద, నీ ఇల్లు లేకపోతే మరొక ఇల్లు దొరుకుతుంది కానీ నీకు అలాంటి వాళ్ళు దొరకడం చాలా కష్టం. మనం బ్రతికే ఈ సంఘం లో ఒకరి మీద ఆధారపడనిదెవరు చెప్పు ?

మమతానురాగాలకోసం కుటుంబం మీదా, పరస్పర సహాయ సహకారాల కోసం బంధువులూ, స్నేహితులమీదా ఆధారఫడటం లేదూ? ఇల్లు సజావుగా నడిపే జీతపు రాళ్ళకోసం నీ భర్తా, అన్నలూ తమ ఆఫీసులమీద మీద ఆధారపడటం లేదూ? ఇదొక గొలుసు, ఎక్కడా లంకెలు తెగకుండా ఉన్నన్నంతకాలం అందరూ హాయిగా ఉంటారు. ఎక్కడైనా తెగితే ఇదిగో ఇలాగే, ఉంటుంది. విత్తుకు చెట్టు ఆధారమా? చెట్టుకు విత్తు ఆధారమా? తీగెకు పందిరా, పందిరికి తీగా? ఇలాంటివన్నీ సమాధానం లేని ప్రశ్నలు.

నన్నడిగితే వాళ్ళిద్దరితో మాట్లాడి విషయాన్ని మరింత తెగేవరకూ లాగకుండా చూసుకోమంటాను. మరొకరిని చూసుకోగలను, లేదా నేనే చేసుకోగలను అన్న నమ్మకం నీకుంటే నీ ఇష్టం. ఆలోచించుకుని నిర్ణయించుకో, ఇప్పటికే వాసంతి కోసం బెంగ పెట్టుకున్న పిల్లలని పరిగణనలోకి తీసుకోవడం మాత్రం మర్చిపోకు." అందావిడ ధృఢంగా.

'చపాతీలోంచి జాం అస్సలు చేతికి అంటకుండా చుట్టి ఇస్తే కానీ తినడు ఒకడు.

రోజూ బిల్డింగ్ చుట్టూ పది రౌండ్లు సైకిల్ తొక్కుతూ వెనకే ఉండమంటాడు రెండోవాడు.

ఒకడు స్టీల్ గ్లాస్ లో పాలు తాగితే, మరొకడు బన్నీ కప్ లోనే తాగుతాడు.

ఇలాంటి సవాలక్ష విషయాలని గుర్తు పెట్టుకుని సమయానికి తగ్గట్టుగా వాళ్ళని చూసుకుంటూ, ఇంటి పనులు చూసుకోవడంలో తలమునకలువుతున్న దీపిక తల్లి మాటలకి సహజంగానే ఆలోచనలో పడింది. దాని ఫలితమే వాసంతీ, లక్ష్మీ వాళ్ళ ఇంటికి రాక.

' తన మనసుని గుర్తిస్తారు, మాటని గౌరవిస్తారు, తప్పక వస్తారన్న నమ్మకం తో ఇంటికి బయలుదేరింది, ఆ నమ్మకం ఇది పరస్పరం ఒకరికొకరు చేసుకునే సహాయం మాత్రమే అన్న భావన లోంచి వచ్చింది కనక అది తప్పు కుండా జరుగుతుందని ఆమె విశ్వాసం.'

ఆమె మాటల్లోని మార్పు గుర్తించిన తల్లీ కూతుళ్ళిద్దరూ ఆమె నమ్మకాన్ని వమ్ము చెయ్యలేదు.

●●●

Click here to share your comments on this story